సాక్షి
నంద్యాల
శనివారం | 3 | మే | 2025



పెద్దపులి మృతిపై దర్యాప్తు

నల్లమల అడవిలో పెద్దపులి మృతి ఘటనపై ఎన్ఎస్టీఆర్ ఫీల్డ్ డైరెక్టర్ కృష్ణమూర్తి శుక్రవారం దర్యాప్తు ప్రారంభించారు. దేవరసెల ప్రాంతానికి చేరుకుని ఆధారాలు సేకరించారు. 10లో▸



జ్వాలాపురంలో అధికారులు

జ్వాలాపురం సమీపంలోని కొండలను అధికారులు పరిశీలించారు. ఆది మానవుల ఆనవాళ్లపై పరిశోధనలు చేయాల్సి ఉందని, భూ పొరలను ధ్వంసం చేయొద్దని సూచించారు. 10లో▸



ధ్వజారోహణం.. దేవతాహ్వానం

ఎగువ అహోబిలేశుని బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్ర వారం ధ్వజారోహణం నిర్వహించారు. సకల దేవతలను ఆహ్వానిస్తూ గరుత్మంతుని చిత్రపటావిష్కరణ చేశారు. 10లో▸

న్యూస్‌రీల్

4న మహానందిలో వైశాఖ శుద్ధ సప్తమి వేడుకలు



మహానందిలోని రుద్రగుండం కోనేరు

మహానంది: ప్రముఖ పుణ్యక్షేత్రమైన మహానందిలో ఈ నెల 4వ తేదీన వైశాఖ శుద్ధ సప్తమి వేడుకలు నిర్వహించనున్నట్లు ఆలయ వేదపండితుడు రవిశంకర అవధాని, ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి తెలిపారు. శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడుతూ.. ప్రతి ఏడాది వైశాఖ శుద్ధ సప్తమి రోజున గంగాదేవి స్వయంగా మహానంది రుద్రగుండం కోనేరులో స్నానమాచరించి భక్తుల పాపాలను పోగొడుతుందన్నారు. ఆ రోజు స్నానం చేయడం 12 ఏళ్లకు ఒకసారి వచ్చే గంగానది పుష్కరస్నానంతో సమానమన్నారు. వేడుకల్లో భాగంగా గంగాదేవికి ప్రత్యేక పూజలు చేస్తామని చెప్పారు.

ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా సంస్థ(ఐటీఐ)లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఏ.రవీంద్రబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రెండు సంవత్సరాల ఫిట్టర్, టర్నర్, ఎలక్ట్రీషియన్ కోర్సులు, ఒక సంవత్సరం మెకానికల్ డీజిల్, వెల్డర్ కోర్సులు ఉన్నాయని పేర్కొన్నారు. ఈ నెల 24లోగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. వివరాలకు 9703395091, 9440748448, 08524–286055లను సంప్రదించాలన్నారు.

నేటి నుంచి మహానందీశ్వరుడి నిరంతర దర్శనం

మహానంది: వేసవి సెలవుల దృష్ట్యా మహానంది ఆలయంలో నేటి నుంచి జూన్ 15 వరకు నిరంతర దర్శనం కల్పిస్తున్నట్లు ఆలయ సూపరింటెండెంట్ అంబటి శశిధర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ శనివారం నుంచి భక్తులకు అసౌకర్యం కలుగకుండా నిరంతరంగా మహానందీశ్వరుడి దర్శనం కల్పిస్తున్నట్లు ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి నిర్ణయం తీసుకున్నారని చెప్పారు. ప్రస్తుతం ఉదయం నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, తిరిగి మధ్యాహ్నం 2గంటల నుంచి రాత్రి 9.30 గంటల వరకు దర్శనం కొనసాగుతోందన్నారు. తాజా నిర్ణయంతో జూన్ 15 వరకు ఎలాంటి విరామం లేకుండా నిరంతరాయంగా దర్శన భాగ్యం లభిస్తుందన్నారు.

శ్రీశైలంలో భారీ వర్షం



క్షేత్ర పరిధిలో కురుస్తున్న వర్షం

శ్రీశైలం టెంపుల్: శ్రీశైలంలో ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. శుక్రవారం మధ్యాహ్నం మూడు గంటల నుంచి భారీ ఈదురు గాలులు వీచాయి. అనంతరం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. భారీ వర్షానికి శ్రీశైలం రోడ్లన్నీ జలమయమయ్యాయి. వర్షం ధాటికి పలువురు భక్తులు వసతి గృహాలకే పరిమితమయ్యారు. ఈదురు గాలులకు క్షేత్ర పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

హుండీ ఆదాయం రూ.1.14 కోట్లు

కౌతాళం: ఉరుకుంద ఈరన్న స్వామి దేవాలయ హుండీల్లో భక్తులు సమర్పించిన కానుకలను శుక్రవారం లెక్కించారు. మొత్తం 56 రోజులకు భక్తులు నగదు రూపంలో రూ.1,14,68,836 సమర్పించినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ విజయరాజు, హుండీ పర్యవేక్షణ అధికారి వెంకటేశ్ తెలిపారు.

ఆపసోపాలు



ఉమ్మడి జిల్లాలో 'క్షీర' సంక్షోభం

- వేసవిలో తగ్గిపోయిన పాల ఉత్పత్తి
- రోజుకు 13 లక్షల లీటర్లు అవసరం
- లభించేది 5 లక్షల లీటర్లు మాత్రమే
- ఇతర జిల్లాలు, రాష్ట్రాల నుంచి దిగుమతి

ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఏర్పడిన కరువు పరిస్థితులు 'క్షీర' క్షోభానికి దారితీశాయి. వేసవి కాలం పాల ఉత్పత్తి పూర్తిగా తగ్గిపోయింది. శిశువులు ఏడుస్తున్నా సీసాలో నింపి కాసిన్ని పాలు ఇవ్వలేని దుస్థితి నెలకొంది. ఇంట్లో ఉన్న వృద్ధులకు సైతం పాలు వేడి చేసి ఇవ్వడం కష్టంగా మారుతోంది. అంతటా ఆపసో'పాలు' కనిపిస్తున్నాయి.

కర్నూలు(అగ్రికల్చర్): అసలే వేసవి కాలం.. ఒక వైపు పచ్చిమేత కొరత.. మరోవైపు నీటి సమస్య.. దీంతో ఉమ్మడి కర్నూలు జిల్లాలో పాల ఉత్పత్తి గణనీయంగా పడిపోయింది. ఈ సమయంలో రాష్ట్ర ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవడం లేదు. ఊరూరా పశుగ్రాస క్షేత్రాలు అంటూ హడావుడి చేసినప్పటికీ ఇంత వరకు కార్యరూపం దాల్చలేదు. ఇండియన్ మెడికల్ రీసెర్చ్ ప్రకారం ప్రతి ఒక్కరూ రోజుకు 250 ఎంఎల్ పాలు తీసుకోవాల్సి ఉంది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో దాదాపు 52 లక్షల జనాభా ఉంది. వీరి ప్రతి రోజూ 13 లక్షల లీటర్ల పాలు అవసరం అవుతాయి. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో అన్ని పాలు అందుబాటులో లేవు.

నీరు లేదు.. పచ్చిమేత కరువు

ఉమ్మడి కర్నూలు జిల్లాలో 2,55,747 పశువులు ఉన్నాయి. వీటిలో 1,61,228 ఆవులు, గేదెల నుంచి మాత్రమే పాల దిగుబడి ఉంది. మిగిలినవి చూలు(ప్రెగ్నెంట్)తో, గొడ్డుబోతు పశువులుగా ఉన్నాయి. ఆగస్టు నుంచి జనవరి వరకు పచ్చిమేత నీరు పుష్కలంగా ఉండటంతో 10 లక్షల పాలు ఉత్పత్తి అయ్యేవి. కరువు పరిస్థితుల్లో ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఫిబ్రవరి నుంచి పాల ఉత్పత్తి తగ్గింది. ప్రస్తుతం పశువులకు పచ్చిమేత లేదు.. నీరు కూడా లభించని పరిస్థితి నెలకొంది. దీంతో వేసవిలో పాల దిగుబడి 50 శాతానికి పైగా పడిపోయింది. కేవలం 5 లక్షల లీటర్ల పాలు ఉత్పత్తి అవుతున్నాయి.

దిగుమతి ఇలా..

ఉత్పత్తి తగ్గిపోవడంతో డెయిరీ నిర్వాహకులు పక్క జిల్లాలు, ఇతర రాష్ట్రాల నుంచి పాలు దిగుమతి చేసుకుంటున్నారు. కొన్ని ప్రయివేటు డెయిరీలు మహారాష్ట్ర నుంచి దిగుమతి చేసుకుంటున్నాయి. మరికొన్ని డెయిరీలు ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు జిల్లాలను ఆశ్రయించాయి. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 14 లక్షల కుటుంబాలు ఉండగా... దాదాపు 40 శాతం కుటుంబాలు లూజు పాలు వినియోగిస్తున్నాయి. 60 శాతం కుటుంబాలు ప్యాకెట్ పాలను వినియోగిస్తున్నట్లు తెలుస్తోంది. నేడు గ్రామాల్లో పశుసంపద తగ్గిపోయింది. గ్రామాల్లో కూడా ప్యాకెట్ పాలే వినియోగిస్తున్నారు.

పాలపొడికి డిమాండ్

డెయిరీల్లో వెన్న పూర్తి తీసి పాలపొడి తయారు చేస్తారు. పాల కొరత ఉన్నసమయంలో పాల పొడిని ఉపయోగించి పాలు తయారు చేస్తారు. పాలపొడితో టోన్డ్ మిల్క్ తయారు అవుతాయి. టోన్డ్ మిల్క్‌లో వెన్న 3 శాతం ఉంటుంది. గేదె పాలల్లో వెన్న 6.50 శాతం నుంచి 8 శాతం ఉంటుంది. ఆరు శాతంపైన ఉన్న వెన్నను తీసి 6 శాతం వెన్నతో గోల్డ్ మిల్క్ తయారు చేస్తారు. పాల పొడిపాలల్లో వెన్న ఉండదు. 50 శాతం పాలపొడి పాలు, మరో 50 శాతం 6 శాతం వెన్న ఉన్న పాలు కలిపితే మొత్తంగా పాలల్లో వెన్న మూడు శాతం ఉన్నట్లు అవుతోంది. వీటితో టోన్డ్ మిల్క్ ప్యాకెట్లు తయారు చేసి వినియోగదారులకు సరఫరా చేస్తున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం మార్కెట్‌లో లభ్యమవుతున్న టోన్డ్‌మిల్క్ పాలు పాలపొడితో తయారు చేసినవేనని స్పష్టమవుతోంది.



పాడిపశువులు

ఉత్తుత్తి హడావుడే

వేసవిలో పాల ఉత్పత్తి తగ్గకుండా రాష్ట్ర ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. దాణామృతం (టీఎంఆర్), సమీకృత దాణా వంటి వాటిని సరఫరా చేయాలి. అయితే దాణామృతం లేదు.. దాణా సరఫరా లేకుండా పోయింది. 'ఉపాధి' నిధులతో ఊరూర పశుగ్రాస క్షేత్రాలు ఏర్పాటు అంటూ హడావుడి చేసింది.. ఇంతవరకు కార్యరూపమే దాల్చలేదు. 10 సెంట్ల నుంచి 50 సెంట్ల వరకు భూమిలో ఉపాధి నిధులతో పశుగ్రాసక్షేత్రాలు ఏర్పాటు చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఉమ్మడి జిల్లాలో దాదాపు 600 ఎకరాల్లో పశుగ్రాస క్షేత్రాలు ఏర్పాటుకు అనుమతులు లభించాయి. కాని ఒక్క సెంటులో పశుగ్రాస క్షేత్రం ఏర్పాటు చేసిన దాఖలాలు లేవు. వేసవిలో పశువుల దాహార్తి తీర్చేందుకు ఉపాధి నిధులతో ఇదుగో నీటితొట్లు ఏర్పాటు చేస్తున్నామని ప్రకటించినప్పటికీ ఆచరణలో సాధ్యం కాలేదు. అక్కడక్కడ నీటితొట్లు నిర్మించినప్పటికీ వాటిని నీటితో నింపేవారు కరువయ్యారు. రైతుల చేతికి పంటలే చేతికి అందలేదు. దీంతో రైతులు పాడిగేదెలకు మేతను సర్దుబాటు చేయలేక కబేళాలకు తరలిస్తున్నారు.

పాల ఉత్పత్తి తగ్గింది



మాకు 14 ముర్రా గేదెలు ఉన్నాయి. అన్నీ పాలు ఇస్తాయి. డిసెంబరులో రోజుకు 90 నుంచి 100 లీటర్ల వరకు పాలు ఉత్పత్తి అయ్యేవి. ఫిబ్రవరి నుంచి పాల ఉత్పత్తి తగ్గింది. రోజుకు 50 నుంచి 55 లీటర్ల పాలు ఉత్పత్తి అవుతున్నాయి. దాణా ఖర్చులు పెరిగాయి. వేసవిలో పచ్చి మేత తగినంత లేదు. నీటి సమస్య, ఎండల తీవ్రతతో పాల ఉత్పత్తి బాగా తగ్గింది. వర్షాలు కురిసి పచ్చి మేత అందుబాటులోకి వస్తే ఆగస్టు నుంచి పాల ఉత్పత్తి పెరిగే అవకాశం ఉంది.

– వెంకటేశ్వరరెడ్డి, సర్పంచ్, మల్లెపల్లి, వెల్దుర్తి మండలం

త్వరలో దాణామృతం ఇస్తాం



వేసవిలో పాల ఉత్పత్తి 20 నుంచి 30 శాతం వరకు తగ్గుతుంది. వేసవిలో పాల ఉత్పత్తి తగ్గకుండా తగిన చర్యలు తీసుకుంటున్నాం. ఒక్కో జిల్లాకు 250 టన్నుల సమీకృత దాణాను ప్రభుత్వం కేటాయించింది. త్వరలోనే పాడి రైతులకు సరఫరా చేస్తాం. పశుగ్రాసాల సాగుకు గడ్డి విత్తనాలను కూడా సబ్సిడీపై ఇస్తాం. వేసవిలో పశువుల కోసం ఉపాధి నిధులతో గ్రామాల్లో నీటితొట్లు కూడా ఏర్పాటు చేయనున్నాం.

– డాక్టర్ జి.శ్రీనివాస్, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి

నంద్యాలలో నాలుగు 'నీట్' కేంద్రాలు

- జిల్లా కలెక్టర్ రాజకుమారి



అధికారులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ రాజకుమారి

నంద్యాల న్యూటౌన్: మెడికల్ కోర్సుల్లో ప్రవేశాల కోసం ఈనెల 4వ తేదీన నిర్వహించే నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రెన్స్ టెస్టు (నీట్) కోసం నంద్యాలలో నాలుగు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు జిల్లా కలెక్టర్ రాజకుమారి తెలిపారు. జిల్లాలో ప్రథమంగా 'నీట్' నిర్వహిస్తున్న నేపథ్యంలో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. నంద్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం చీఫ్ సూపరింటెండెంట్ల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. నంద్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాల, నంద్యాల బస్టాండ్ సమీపంలో ఉన్న గవర్నమెంట్ హైస్కూల్, టెక్కె జూనియర్ కళాశాల, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో 'నీట్' కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. మొత్తం 1,172 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నట్లు తెలిపారు. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఆఫ్‌లైన్ విధానంలో పరీక్ష నిర్వహిస్తారన్నారు. మధ్యాహ్నం 1.30 గంటల తరువాత విద్యార్థులకు పరీక్ష కేంద్రంలోకి అనుమతి లేదన్నారు. దివ్యాంగ విద్యార్థులకు ప్రతి పరీక్ష కేంద్రంలో రెండు వీల్ చైర్లను ఏర్పాటు చేయాలన్నారు. పరీక్ష కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతించకూడదన్నారు. నంద్యాల పట్టణంలో విద్యార్థులకు ట్రాఫిక్‌తో సమస్య లేకుండా చూడాలన్నారు. 'నీట్'పై పాటించాల్సిన నియమ నిబంధనలపై జిల్లా కోఆర్డినేటర్ సత్యనారాయణ పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌తో చీఫ్ సూపరింటెండెంట్లకు వివరించారు. నీట్ పరీక్షల సిటీ కోఆర్డినేటర్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

1000 హెక్టార్లలో ఆయిల్‌పామ్ సాగు

కర్నూలు(అగ్రికల్చర్): ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఈ ఏడాది 1000 హెక్టార్లలో ఆయిల్‌పామ్ సాగుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. హెక్టారుకు ఆయిల్ పామ్ మొక్కలు నాటుకోవడానికి రూ.25,250 నుంచి రూ.29 వేల వరకు సబ్సిడీ ఇస్తోంది. అధిక సాంద్రతలో మొక్కలు నాటుకుంటే రూ.29వేలు, మొక్కలు తక్కువ వచ్చే విధానంలో నాటుకుంటే రూ.25,250 సబ్సిడీ లభిస్తుందని జిల్లా ఉద్యాన అధికారి పి.రామాంజనేయులు తెలిపారు. కర్నూలు జిల్లాలో 500 హెక్టార్లు, నంద్యాల జిల్లాలో 500 హెక్టార్లలో సాగు చేయాలనేది లక్ష్యం. మొక్కలు కంపెనీలే సరఫరా చేస్తుండటం వల్ల సబ్సిడీలను కంపెనీలకే విడుదల చేస్తారు. నాలుగేళ్ల పాటు ఏడాదికి రూ.5,250 ప్రకారం నిర్వహణ కింద సబ్సిడీ ఇస్తారు. నాలుగేళ్ల పాటు అంతర పంటలుగా వ్యవసాయ, ఉద్యానపంటలు సాగు చేసుకోవచ్చు. అంతరపంటల సాగుకు ఏడాదికి రూ.5,250 ప్రకారం నాలుగేళ్ల పాటు సబ్సిడీ లభిస్తుందని జిల్లా ఉద్యాన అధికారి పేర్కొన్నారు.

అయ్యో.. అవ్వ!



వంగిపోయిన నడుముతో కర్ర సహాయంతో నిలబడిన ఈ వృద్ధురాలి పేరు కొమ్ము లక్ష్మమ్మ. పగిడ్యాల మండలం పడమర ప్రాతకోట ఎస్సీ కాలనీకి చెందిన ఈమెకు 95 సంవత్సరాలు ఉన్నాయి. అనేక కష్టాలు ఉన్నా పింఛన్ వస్తుందనే ఆశతో జీవనం సాగిస్తున్నారు. అయితే అధికారులు అవ్వ ఆవేదనను అర్థం చేసుకోవడం లేదు. ఈమె భర్త రాముడు 70 ఏళ్ల క్రితం మృతిచెందగా కుమారుడైన నరసింహను పెంచి పోషించారు. కుమారునికి వివాహమై ముగ్గురు పిల్లలు పుట్టారు. అయితే 20 ఏళ్ల క్రితం కుమారుడు మృతి చెందడంతో కొమ్ము లక్ష్మమ్మకు కోడలు సుబ్బమ్మ, ముగ్గురు చంటి పిల్లలు దిక్కు అయ్యారు. అవ్వ మూడు సార్లు తేలుకాటుకు గురై.. కుడిచేయి పని చేయడం లేదు. ప్రస్తుతం భోజనం చేయలేదని దుస్థితి. అనారోగ్యంతో ఆపరేషన్ చేయించుకుని పెద్ద మనుమడు రాంబాబు మంచానికే పరిమితమయ్యాడు. అవ్వకు దుఃఖమే మిగిలింది. ఏ ఆధారం లేని తనకు జిల్లా కలెక్టర్ స్పందించి వికలాంగుల పింఛన్‌ను మంజూరు చేసి ఆదుకోవాలని ఈమె వేడుకుంటున్నారు.

– పగిడ్యాల

భూ వివాదాలతోనే లక్ష్మినారాయణ హత్య



హత్య కేసు వివరాలను వెల్లడిస్తున్న ఏఎస్పీ హుస్సేన్ పీరా

ఆలూరు రూరల్: కాంగ్రెస్ నేత, ఎమ్మార్పీఎస్ రాయలసీమ అధ్యక్షుడు లక్ష్మినారాయణ హత్యకు భూ వివాదాలు, పంచాయతీలే కారణమని అడిషనల్ ఎస్పీ హుసేన్ పీరా తెలిపారు. ఆలూరులోని పోలీసు సర్కిల్ కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి వివరాలను వెల్లడించారు. లక్ష్మినారాయణ హత్య కేసులో 14 మందిపై కేసు నమోదు చేశామన్నారు. అయితే పది మందిని నిందితులుగా గుర్తించామన్నారు. లక్ష్మినారాయణ కుమారుడు వినోద్ ఫిర్యాదు చేసినట్లు వైకుంఠం ప్రసాద్, వైకుంఠం మల్లికార్జున, మల్లేష్, చికెన్ రామాంజిలపై కేసు దర్యాప్తులో ఉందని, వీరి పాత్ర ఉంటే తగిన చర్యలు తీసుకుంటామన్నారు. అనంతపురం జిల్లా గుంతకల్లు పట్టణానికి చెందిన ప్రధాన నిందితులైన పూనుగొండ్ల రాజేష్, బేపర్ గౌసియా, కత్రిమల సౌభాగ్యలను పత్తికొండ డీఎస్పీ వెంకటరామయ్య, ఆలూరు సీఐ రవి శంకర్ రెడ్డితో కలిసి శుక్రవారం హైవే 167లోని నక్కనదొడ్డి గ్రామం వద్ద అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. ఇదే కేసులో ముద్దాయిలుగా ఉన్న పెద్దన్న, బోయ మేకల శ్రీనివాసులు, బోయ గోవిందు, బోయ రాము, వడ్డే నవీన్, ధర్మ, మనోహర్లను అరెస్టు చేయాల్సి ఉందన్నారు.

హత్యకు కారణమైన వివాదాలు

అనంతపురం జిల్లా గుంతకల్లు పట్టణంలోని ఆలూరు రోడ్డులో ఉన్న 1.10 ఎకరాల ఇంటి స్థలాల భూమి, సిద్ధార్థ కాలనీలోని 9 ఎకరాల దేవదాయ భూమి పంచాయతీ విషయంలో గుంకతల్లుకు చెందిన గౌసియా, రాజేష్‌లతో లక్ష్మినారాయణకు వివాదం నడుస్తోంది. ఈ భూమిలోని 4 ఎకరాల్లో లక్ష్మినారాయణ ప్లాట్లు వేసి విక్రయించాడు. గుంతకల్లు మండలం కొనకొండ్ల చెందిన ఇద్దరి మధ్య వివాహేతర సంబంధం విషయంలోనూ ఆయన పంచాయతీ చేసినట్లు తెలిసింది. అలాగే పెద్దన్నకు చెందిన 8 ఎకరాల భూమికి ఏడేళ్ల క్రితం లక్ష్మినారాయణ తన అత్త పేరిట నకిలీ పాసు పుస్తకాలు సృష్టించాడు. ఈ భూమి వివాదం కోర్టులో ఉంది. ఈ విషయంలో వివాదంతో పాటు పెద్దన్నపై లక్ష్మినారాయణ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయించారు. అదేవిధంగా నాలుగు నెల క్రితం పెద్దన్న, రాజేష్, గౌసియాలను లక్ష్మినారాయణ బహిరంగంగా దూషించడంతో వారంతా ఆయనను అంతమొందించాలని నిర్ణయించుకున్నారు.

పథకం ప్రకారమే హత్య

- రెండు నెలల క్రితం హిందూపురంలో టిప్పర్ కొనుగోలు చేశారు.
- గత నెల 27న ఉదయం పెద్దయ్య ఇంటి వద్ద సమావేశమయ్యారు.
- అదే రోజు మధ్యాహ్నం లక్ష్మినారాయణ గుంతకల్లు నుంచి తన స్వగ్రామమైన చిప్పగిరికి ఇన్నోవా కారులో బయలుదేరాడు.
- రాజేష్ అతన్ని మరో కారులో అనుసరించి టిప్పర్ డ్రైవర్ మేకల శ్రీనివాసులు, మరో వ్యక్తి ధర్మన్నకు సమాచారం ఇస్తూ వచ్చాడు.
- మరో నిందితుడు రాము మార్గమధ్యంలో ఉండి టిప్పర్ డ్రైవర్‌ను అప్రమత్తం చేశాడు.
- లక్ష్మినారాయణ కారు గుంతకల్లు సమీపంలోని రైల్వే బ్రిడ్జి వద్దకు రాగానే డ్రైవర్ శ్రీనివాసులు ఇన్నోవా కారును బలంగా ఢీకొట్టాడు.
- పక్కనే వేచి ఉన్న పెద్దన్న కొడవలితో లక్ష్మినారాయణ తలపై నరికాడు.
- మరో వ్యక్తి వడ్డే నవీన్ వెంట తెచ్చుకున్న ఇనుప రాడ్డుతో ఆయన తలపై కొట్టాడు.
- మిగిలిన నిందితులు రహదారిలో ఎవరూ రాకుండా జాగ్రత్త వహించారు.
- లక్ష్మినారాయణపై దాడి అనంతరం అందరూ కలిసి పరారయ్యారని ఏఎస్పీ హుసేన్ పీరా విలేకరులకు వెల్లడించారు.
- విలేకరుల సమావేశంలో పత్తికొండ డీఎస్పీ వెంకటరామయ్య, ఆలూరు సీఐ రవి శంకర్ రెడ్డి, హొళగుంద ఎస్ఐ దిలీప్ కుమార్, ఆలూరు ఎస్ఐ మహబూబ్ బాషా, చిప్పగిరి ఎస్ఐ శ్రీనివాసులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడి ఇంటికి ఆలయ నీరు!



టీడీపీ నాయకుడు వేసుకున్న ప్లాస్టిక్ పైపులైన్

ఆలూరు: దేవస్థానంలో భక్తులకు అందాల్సిన నీరు టీడీపీ నాయకుడి ఇంటికి నేరుగా వెళ్తోంది. ఇందుకు అక్రమంగా పైప్‌లైన్ వేసుకున్నారు. అధికారుల అనుమతి కూడా తీసుకోలేదు. ఆలూరు మండలంలోని మొలగవెల్లి గ్రామంలో కాశీవిశ్వేశ్వరస్వామి దేవాలయం ఉంది. ఆలయానికి వచ్చే భక్తులకు తాగునీటి వసతి కల్పించాలని పంచాయతీ అధికారులకు గ్రామపెద్దలు విన్నవించారు. ఇదే అదునుగా భావించిన గ్రామ టీడీపీ నాయకుడు దేవాలయంలో భక్తుల తాగు నీటికోసం ఇచ్చిన మంచినీటి పైపులకు అదనంగా వాల్‌ను బిగించుకున్నారు. ప్లాస్టిక్ పైపులైన్ వేసుకుని తన ఇంటికి దేవాలయ నీటిని తరలించుకుంటున్నారు. ఈ నీటితో తన వాహనాలను శుభ్రం చేస్తున్నారు. టీడీపీ నాయకుడి దౌర్జన్యాన్ని చూసి గ్రామ ప్రజలు ఇదేమి చోద్యం అని చర్చించుకుంటున్నారు. అంతటితో ఆగకుండా పంచాయతీ అధికారులకు సైతం ఫిర్యాదు చేశారు. ఈ విషయాన్ని పీఎస్ వెంకటనాయుడి దృష్టికి తీసుకెళ్లగా.. అక్రమ మంచినీటి కుళాయి కనెక్షన్‌ను తీసుకున్న విషయాన్ని పరిశీలించి చర్యలు తీసుకుంటానని తెలిపారు.

జిల్లాకు 13.50 లక్షల బీటీ పత్తి విత్తన ప్యాకెట్లు

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లాలో పత్తి సాగుకు 13.50 లక్షల బీటీ విత్తన ప్యాకెట్లు అవసరమని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. నల్లరేగడి నేలలు ఎక్కువగా ఉండటంతో పత్తి సాగు అధికంగా ఉంటోంది. వచ్చే ఖరీఫ్‌లో 2.45 లక్షల హెక్టార్లో పత్తి సాగయ్యే ఆకాశం ఉంది. హెక్టారుకు 450 గ్రాముల బీటీ పత్తి విత్తన ప్యాకెట్లు ఐదు అవసరమవుతాయి. ఈ ప్రకారం జిల్లాకు 13.50 లక్షల బీటీ విత్తన ప్యాకెట్లు అవసరం. వీటిని 11 కంపెనీలు సరఫరా చేస్తాయి. జిల్లాలో ప్రధానంగా బీటీ-2 పత్తి సాగు చేస్తారు. 450 గ్రాముల ప్యాకెట్ ధర రూ.901 ఉంది. బీటీ పత్తి ప్యాకెట్లకు ఎలాంటి సబ్సిడీలు ఉండవు. ఎంఆర్‌పీ ప్రకారం చూసినా రైతులు విత్తన ప్యాకెట్ల కోసమే రూ.122 కోట్లు ఖర్చు చేయనున్నారు. బ్రాండెడ్ కంపెనీల విత్తన ప్యాకెట్లను డీలర్లు బ్లాక్‌లో విక్రయించనున్నారు. జిల్లాలో బీటీ-2 విత్తన ప్యాకెట్లపైనే రైతులు రూ.200 కోట్ల వరకు ఖర్చు చేయనున్నారు.

రమణీయం.. స్వర్ణ రథోత్సవం



స్వర్ణరథంలో ఉత్సవమూర్తులకు పూజలు చేస్తున్న అర్చకులు



స్వర్ణ రథోత్సవంలో బాలికల కోలాటం

శ్రీశైలంటెంపుల్: ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకుని శ్రీశైల మహాక్షేత్రంలో శుక్రవారం శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్లకు స్వర్ణరథోత్సవం నిర్వహించారు. వేకువజామున స్వామివారికి మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, అన్నాభిషేకం చేశారు. లోక కల్యాణాన్ని కాంక్షిస్తూ అర్చకులు సంకల్పాన్ని పఠించారు. అనంతరం రథారూఢులైన శ్రీస్వామి అమ్మవార్లకు విశేషపూజలు జరిపించారు. ఉదయం 7.30గంటలకు స్వర్ణరథోత్సవం ప్రారంభమైంది. ఆలయ మహాద్వారం ముందుభాగం గంగాధర మండపం నుంచి నందిమండపం వరకు రథోత్సవాన్ని జరిపించారు. రథోత్సవంలో కోలాటం, చెక్కభజన మొదలైన జానపద కళారూపాలు అలరించాయి. శ్రీశైల దేవస్థాన డిప్యూటీ కార్యనిర్వహణాధికారి రమణమ్మ, సహాయ కమిషనర్ ఇ.చంద్రశేఖరరెడ్డి, పలు విభాగాల అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఫైనల్ మెరిట్ లిస్ట్, సెలెక్షన్ లిస్ట్‌ల విడుదల

కర్నూలు(హాస్పిటల్): కర్నూలులోని స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌లో ఉద్యోగ ఖాళీల భర్తీ కోసం గత ఏడాది జనవరి 29న జారీ చేసిన నోటిఫికేషన్‌కు సంబంధించి మెడికల్ ఫిజిసిస్ట్, అనెస్తీషియా టెక్నీషియన్, ఓటీ అసిస్టెంట్, జనరల్ డ్యూటీ అటెండెంట్ కేటగిరిల అభ్యర్థుల ఫైనల్ మెరిట్ లిస్ట్‌లు, సెలక్షన్ లిస్ట్‌లను కర్నూలు, నంద్యాల జిల్లాలు, కర్నూలు మెడికల్ కాలేజీల ప్రభుత్వ వెబ్‌సైట్‌లు https://kurnool.ap.gov.in, https://nandyal.ap.gov.in,https://kurnoolmedicalcollege.ac.inలలో ఉంచినట్లు కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లు, రెండు సెట్ల జిరాక్స్ సర్టిఫికెట్లతో ఈనెల 6 నుంచి 8వ తేదీ వరకు ఉదయం 10.30 గంటలకు కర్నూలు మెడికల్ కాలేజీలో నిర్వహించే కౌన్సెలింగ్‌కు హాజరుకావాలన్నారు.

ఈశ్రమ్ కార్డులు పొందండి

- జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి



మాట్లాడుతున్న లీలా వెంకటశేషాద్రి

కర్నూలు(సెంట్రల్): అసంఘటిత రంగంలో ఉన్న కార్మికులందరూ ఈ శ్రమ కార్డులను పొందేలా పారా లీగల్ వలంటీర్లు కృషి చేయాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకటశేషాద్రి సూచించారు. శుక్రవారం జిల్లా న్యాయ సేవా సదన్‌లో అంతర్జాతీయ కార్మిక దినోత్సవాల్లో భాగంగా పారా లీగల్ వలంటీర్లకు కార్మికులు ఈశ్రమ కార్డును పొందేలా అవగాహన కల్పించడం కోసం సదస్సును ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ శ్రమ కార్డు ను పొందిన కార్మికులకు ఉచితంగా రూ.2లక్షల ప్రమాద బీమా సదుపాయం ఉందన్నారు. కార్మికుల పిల్లలకు స్కాలర్‌షిప్పులు, వారి పెళ్లిళ్లకు ఆర్థిక సాయం పొందేందుకు అవకాశం ఉంటుందన్నారు. అనంతరం అసిస్టెంట్ లేబర్ కమిషనర్ సాంబశివరావు, పారా లీగల్ వలంటీర్లకు అవగాహన కల్పించారు.

నేటి నుంచి హ్యాండ్‌బాల్ పోటీలు

కర్నూలు (టౌన్): ప్రకాశం జిల్లా మార్కాపురంలోని సుజాత ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూట్ క్రీడా మైదానంలో ఈనెల 3,4 తేదీల్లో 54వ రాష్ట్రస్థాయి మహిళా హ్యాండ్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించనున్నట్లు హ్యాండ్‌బాల్ సంఘం నిర్వహణ కార్యదర్శి గణేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోటీల్లో ప్రతిభ కనచరచిన క్రీడాకారులను ఆంధ్రప్రదేశ్ జట్టుకు ఎంపిక చేస్తారని వెల్లడించారు.

ధ్వజారోహణం.. దేవతాహ్వానం



ప్రత్యేకాలంకరణలో కొలువైన ఉత్సవమూర్తులు

- సకల దేవతలను ఆహ్వానిస్తూ ధ్వజపటావిష్కరణ, ధ్వజారోహణం
- పట్టు పీతాంబరాలు.. వజ్రవైఢూర్యాలు ధరించి కొలువుదీరిన దేవతామూర్తులు



ఉభయ దేవేరులతో ధ్వజపటావిష్కరణ, ధ్వజారోహణం కార్యక్రమానికి వేంచేస్తున్న జ్వాలానరసింహుడు

ఆళ్లగడ్డ: సత్యలోకానికి సంకేతంగా కోటి సూర్యతేజస్సుతో వెలిగిపోయే గరుడ ఆళ్వార్లను మంత్రపూర్వకంగా ఆహ్వానించే ధ్వజారోహణం.. తనువు మనసు పులకించిపోతుండగా దేవదేవుడి వాహనమైన గరుత్మంతుని ద్వారా దేవతలను ఆహ్వానించే దేవతాహ్వానం.. భేరీపూజ.. లను ఎగువ అహోబిలంలో శుక్రవారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. మహా పుణ్యక్షేత్రం ఎగువ అహోబిలేశుని నృసింహ జయంతి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడోరోజైన శుక్రవారం ధ్వజారోహణ కార్యక్రమం ఆగమశాస్త్రం ప్రకారం వైభవంగా నిర్వహించారు. బ్రహ్మోత్సవాలకు సకల దేవతలను ఆహ్వానిస్తూ గరుత్మంతుని చిత్రపటావిష్కరణ చేశారు. అంతకుముందు ఉత్సవ మూర్తులైన శ్రీదేవి, భూదేవి సమేత జ్వాలా నరసింహుడిని, గరత్మంతుని సూర్యాస్తమయానికి ముందే పంచామృతాలతో అభిషేకించి పట్టు పీతాంబరాలతో సర్వాంగ సుందరంగా అలంకరించి విడివిడిగా పల్లకీలో కొలువుంచి ఆస్థాన విద్వాంశుల మంగళవాయిద్యాలతో ఆలయ ప్రదక్షిణ చేసిన అనంతరం ఆలయం ఎదురుగా ఉన్న ధ్వజస్తంభం వద్దకు తీసుకువచ్చారు. అక్కడ మొదటి జియర్ ఆదివన్ షఠకోపన్ ఉత్సవ విగ్రహం ఎదురుగా ఉంచి లక్ష్మీనృసింహస్వామి జయంతి బ్రహ్మోత్సవాలకు తరలిరావాలని ఆహ్వానిస్తూ ధ్వజారోహణం చేసి మంత్ర పూర్వకంగా పిలుపునిచ్చారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ప్రధాన ఘట్టమైన జ్వాలానృసింహ స్వామి, శ్రీదేవి, భూదేవి అమ్మవార్ల కల్యాణ మహోత్సవానికి ముక్కోటి దేవతలు వస్తారని విశ్వాసం. స్వామి, అమ్మవార్లను ఆశీర్వదించేందుకు వచ్చే ముక్కోటి దేవతలతో పాటు బ్రహ్మోత్సవాలకు తరలి వచ్చే భక్తులకు ఎటువంటి ఆటంకాలు కలగకుండా గరుత్మంతుడు కాపలా ఉంటాడని పురాణాలు చెబుతున్నాయి.



ధ్వజారోహనం నిర్వహిస్తున్న వేదపండితులు

సింహ వాహనాధీశా.. నమో నారసింహా!

అహోబిల లక్ష్మీనరసింహ స్వామి జయంతి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి జ్వాలానృసింహస్వామి సింహవాహనం అధిష్టించి భక్తులకు దర్శనమిచ్చారు. నిత్యపూజల అనంతరం విశేషాలంకరణ గావించిన సింహవానంపై కొలువైన స్వామి మాడవీధుల్లో ఊరేగుతూ భక్తులను కనువిందు చేశారు.

జ్వాలాపురం సందర్శించిన అధికారులు



జ్వాలాపురం గ్రామం కొండలను పరిశీలిస్తున్న అధికారులు

బనగానపల్లె రూరల్: మండలంలోని జ్వాలాపురం గ్రామ సమీపంలో ఉన్న కొండలను నంద్యాల ఆర్డీఓ నరసింహులు, అనంతపురం, కర్నూలు పురావస్తు శాఖ ఏడీ డాక్టర్ వి రజిత, జిల్లా పర్యాటకశాఖ అధికారి సత్యనారాయణ, డీపీఓ శివారెడ్డి తదితరులు శుక్రవారం సందర్శించారు. 74 వేల ఏళ్ల క్రితం ఇండోనేషియా దేశంలోని సుమత్రా దీవిలో తోబా అగ్నిపర్వతం మహా విస్ఫోటనం చెందడంతో ఎగసి పడిన బూడిద గ్రామ పరిసర ప్రాంతాల్లో పడినట్లు పురావస్తు శాస్త్రవేత్తలు గుర్తించడం తెలిసిందే. ఇక్కడి భూమిలో వ్యవసాయ పంటలు పండించుకోవడంతో పాటు మైనింగ్ కార్యకలాపాల వల్ల బూడిద ఆనవాళ్లు చెదిరిపోయే ప్రమాదముందని, మరిన్ని పరిశోధనలు చేయాల్సిన అవసరం ఉండటంతో భూ పొరలను, మట్టిని, నేలను ధ్వంసం చేయకూడదని అధికారులు గ్రామస్తులకు సూచించారు. ఈ ప్రాంతాన్ని జ్వాలాపురం సర్క్యూట్‌గా అభివృద్ధి చేయడంతో పాటు సమీపంలోనే దద్దణాల ప్రాజెక్టు ఉండడంతో టూరిజం స్పాట్‌గా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి నివేదించనున్నామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ నారాయణరెడ్డి, ఎంపీడీఓ వెంకటరమణ, అసిస్టెంట్ జియాలజిస్టు రవికుమార్, భూగర్భ గనుల శాఖ టెక్నికల్ అసిస్టెంట్ పద్మ, ఈఓఆర్డీ సతీష్‌కుమార్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి శకుంతల, వీఆర్ఓ గోవిందప్ప పాల్గొన్నారు.

బిహార్ సర్పంచ్‌ల బృందం పర్యటన

కర్నూలు(రూరల్): పసుపల గ్రామంలో శుక్రవారం బిహార్ సర్పంచ్‌ల బృందం పర్యటించింది. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో దాదాపు 55 మంది బిహార్ సర్పంచ్‌లు పసుపల గ్రామానికి చేరుకుని అభివృద్ధి పనులను, గ్రామ సచివాలయ వ్యవస్థ పనితీరును, ప్రజలకు అందుతున్న సేవలను పరిశీలించారు. గ్రామం నుంచి సేకరించే తడి, పొడిచెత్త నుంచి తయారయ్యే సేంద్రియ ఎరువు యూనిట్‌ను పరిశీలించారు. ప్రజలకు ప్రభుత్వం అందజేస్తున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. వారి వెంట ఎస్‌ఐఆర్‌డీ అధికారి శశిరేఖ, జిల్లా పంచాయతీ అధికారి భాస్కర్, ఎంపీడీఓ రఘునాథ్, గ్రామ సర్పంచ్ బొగ్గుల శీలమ్మ, పసుపల పంచాయతీ సెక్రటరీ హేమంత్ రెడ్డి ఉన్నారు.



సచివాలయం ప్రాంగంం వద్ద బిహార్ సర్పంచ్‌ల బృదం, జిల్లా పంచాయతీ అధికారులు

బస్సుల కోసం పడిగాపులు





ప్రైవేట్ వాహనం ఎక్కుతున్న ప్రయాణికులు,పాణ్యం బస్టాండ్‌లో బస్సుల కోసం వేచి ఉన్న ప్రయాణికులు

పాణ్యం: ఆర్టీసీ బస్సులన్నింటినీ ప్రభుత్వం అమరావతికి పంపడంతో శుక్రవారం స్థానిక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అమరావతిలోని ప్రధాన మంత్రి నరేంద్రమోదీ సభకు హాజరయ్యే ప్రయాణికుల కోసం బస్సులను గురువారం మధ్యాహ్నం నుంచే పంపారు. అరకొరగా ఉన్న బస్సుల కోసం శుక్రవారం ఉదయం ప్రయాణికులు బస్టాండ్లలో గంటల తరబడి ఎదురుచూడాల్సి వచ్చింది. కొందరు అధిక చార్జీలు వెచ్చించి ప్రైవేట్ వాహనాల్లో గమ్యస్థానాలకు చేరుకున్నారు.

ఆర్‌యూ వర్సిటీ కళాశాల ప్రిన్సిపాల్‌గా ప్రొఫెసర్ కృష్ణారెడ్డి



ప్రొఫెసర్‌లు కృష్ణారెడ్డి, నరసింహులు, సుందరానంద్

కర్నూలు కల్చరల్: రాయలసీమ యూనివర్సిటీ కళాశాల ప్రిన్సిపాల్‌గా ఫిజిక్స్ డిపార్ట్‌మెంట్ హెచ్‌ఓడీ ప్రొఫెసర్ సీవీ కృష్ణారెడ్డిని నియమితులయ్యారు. వర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వి.వెంకట బసరావు ఆదేశాల మేరకు కృష్ణారెడ్డిని నియమించినట్లు రిజిస్ట్రార్ డాక్టర్ విజయకుమార్ నాయుడు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఆర్‌యూలో ఇప్పటి వరకు ఆర్ట్స్, సైన్స్ కళాశాలలకు విడివిడిగా ప్రిన్సిపాల్స్ ఉండగా రెండింటినీ కలిపి ఒకే కళాశాలగా మార్పు చేశారు. ఈనేపథ్యంలో సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్‌గా ఉన్న కృష్ణారెడ్డిని వర్సిటీ కళాశాల ప్రిన్సిపాల్‌గా నియమించారు. దీంతో పాటు డిస్టెన్స్ ఎడ్యుకేషన్ డైరెక్టర్, సెంట్రల్ లైబ్రరీ ఇన్‌ఛార్జిగా బాధ్యతలు అప్పగించారు. రెండేళ్ల పాటు ఈయన ఈ పదవిలో కొనసాగనున్నారు.

- వర్సిటీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్‌గా, వర్సిటీ హాస్టల్స్ వార్డెన్‌గా తెలుగు విభాగం అధిపతి ప్రొఫెసర్ ఎస్.నరసింహులును నియమించారు.
- సీడీసీ డీన్‌గా మాథ్స్ హెచ్‌ఓడీ ప్రొఫెసర్ పీవీ సుందరానంద్‌ను నియమితులయ్యారు. ఈయన ఇప్పటికే ఎగ్జామినేషన్స్ డీన్‌గా ఉన్నారు.
- సుమారు రెండు నెలలుగా ఖాళీగా ఉన్న రాయలసీమ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్‌కు ప్రిన్సిపాల్‌ను నియమించాల్సి ఉంది.
- ఆర్‌యూసీఈకి వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ విజయ కుమార్ నాయుడు ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్‌గా కొనసాగుతున్నారు.

పెద్దపులి మృతిపై దర్యాప్తు ప్రారంభం



దేవరసెల అటవీ ప్రాంతంలో పర్యటిస్తున్న అటవీశాఖ అధికారులు

కొత్తపల్లి: మండలంలోని నల్లమల అడవిలో దేవరసెల ప్రాంతంలో పెద్దపులి మృతి ఘటనపై ఎన్ఎస్‌టీఆర్ ఫీల్డ్ డైరెక్టర్(కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్) కృష్ణమూర్తి శుక్రవారం దర్యాప్తు ప్రారంభించారు. పెద్దపులి మృతి చెందిన దేవరసెల ప్రాంతానికి చేరుకుని ఆధారాలు సేకరించారు. సిబ్బందితో కలిసి అటవీ ప్రాంతంలో కలియతిరిగారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పెద్దపులిది సహజ మరణమా, మరేదైనా కారణమా అనేది ఇప్పుడే చెప్పలేమన్నారు. మృతిచెందిన పులి నుంచి సేకరించిన శాంపిళ్లను పరీక్షల కోసం ల్యాబ్‌కు పంపించామన్నారు. రిపోర్టు వచ్చిన తర్వాత పూర్తి వివరాలు వెల్లడిస్తామన్నారు. అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తామన్నారు. 2004లో ఈ ప్రాంతంలోనే ఓ పులి ఉచ్చులకు చిక్కుకొని గాయపడగా చికిత్స అందించి అటవీ ప్రాంతంలోనే వదిలేశామన్నారు. అదే పులి ఏమైనా అనారోగ్యంతో మృతి చెందిందా అనేది దర్యాప్తులో తేలాల్సి ఉందన్నారు. కాగా అటవీ అధికారులను కూడా మందలించినట్లు తెలిసింది. ప్రొటెక్షన్ వాచర్లను విధులకు పంపి కార్యాలయాలకే పరిమితమవుతుండటంతోనే పులులు, వన్యప్రాణులకు రక్షణ కరవైందని, మరోసారి ఇలాంటి తప్పిదాలు జరగకుండా చూసుకోవాలని హెచ్చరించినట్లు సమాచారం. కార్యక్రమంలో డీఎఫ్ఓ సాయిబాబా, ఎఫ్ఆర్ఓ పట్టాభి, ఎఫ్ఎస్ఓ కావేరి, అటవీ శాఖ వైద్యులు ఉన్నారు.

సారా తయారీ మానుకోకుంటే పీడీ యాక్ట్



నాటుసారా తయారీ కోసం బిందెల్లో ఉంచిన బెల్లం ద్రావణాన్ని వెలికితీస్తున్న ఎక్సైజ్ అధికారులు

కర్నూలు: నాటుసారా తయారీ, రవాణా, విక్రయాలు చేయడం చట్టరీత్యా నేరమని, మానుకోకపోతే పీడీ చట్టం కింద కేసు నమోదు చేసి జైలుకు పంపుతామని కర్నూలు ఎక్సైజ్ సీఐ చంద్రహాస్ హెచ్చరించారు. నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా శుక్రవారం కల్లూరు మండలం ఓబులాపురం తండాలో నాటుసారా స్థావరాలపై దాడులు నిర్వహించారు. సారా బట్టీలను ధ్వంసం చేసి దాదాపు 1600 లీటర్ల బెల్లం ఊట, 30 లీటర్ల నాటుసారాను నేలపాలు చేశారు. గ్రామంలో సారా తయారీదారులతో సమావేశం నిర్వహించి ఇకపై సారా విక్రయాలకు స్వస్తి పలుకుతామని ప్రమాణం చేయించారు. పీడీ చట్టం కింద కేసు నమోదు చేస్తే శిక్ష కఠినంగా ఉంటుందని హెచ్చరించారు. సారా బట్టీలు ఎవరు నడుపుతున్నారనేది దర్యాప్తులో తేలితే వారిపై కూడా కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. ముళ్ల కంపల మధ్యలో ప్లాస్టిక్ బిందెల్లో నిల్వ చేసిన బెల్లం ఊటను కూడా పారబోసి తయారీదారులను హెచ్చరించారు.

బయో ఉత్పత్తులు విక్రయిస్తే కఠిన చర్యలు



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ

కోవెలకుంట్ల: అనుమతులు లేని బయో ఉత్పత్తులు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ హెచ్చరించారు. స్థానిక మార్కెట్ యార్డు రైతు విశ్రాంతి భవనంలో శుక్రవారం సబ్ డివిజన్‌లోని కోవెలకుంట్ల, సంజామల, అవుకు, కొలిమిగుండ్ల, ఉయ్యాలవాడ, దొర్నిపాడు మండలాల రసాయన ఎరువులు, విత్తన, పురుగు మందుల డీలర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఏఓ మాట్లాడుతూ జీ–2, జీ–3 అఫ్లియేషన్ కలిగి వ్యవసాయ కమిషనర్ ఆమోదించిన బయో ఉత్పత్తులను మాత్రమే విక్రయించాలన్నారు. రైతుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని కొందరు విత్తన, ఎరువుల డీలర్లు నాసిరకం విత్తనాలు, ఎరువులు అంటగడుతున్నారన్నారు. విత్తన చట్టం పరిధిలో అధీకృత కంపెనీల ద్వారా జిల్లాలోని రైతులకు నాణ్యమైన రసాయన ఎరువులు, కల్తీ లేని విత్తనాలు, క్రిమి సంహారక మందులు సరఫరా చేయాలన్నారు. రైతులకు తప్పని సరిగా బిల్లులు ఇవ్వాలన్నారు. స్టాక్ వివరాలు, నిల్వలు, గరిష్ట ధరను పొందుపరిచి విక్రయాలు జరపాలన్నారు. అధిక ధరలకు విక్రయిస్తే దుకాణాల లైసెన్స్‌లు రద్దు చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో ఏడీఏ సుధాకర్, జిల్లా వ్యవసాయ కార్యాలయ టెక్నికల్ ఏఓ కల్యాణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తెలుగుగంగ ప్రాజెక్టుకు పాలకుల తూట్లు

- తెలుగుగంగ ప్రాజెక్టు ఆయకట్టు పరిరక్షణ సమితి అధ్యక్షులు బొజ్జా దశరథరామిరెడ్డి



తహసీల్దారుకు వినతి పత్రం అందజేస్తున్న తెలుగుగంగ ఆయకట్టు పరిరక్షణ సమితి సభ్యులు

రుద్రవరం: తెలుగుగంగ ప్రాజెక్టుకు పాలకులు తూట్లు పొడుస్తున్నారని ప్రాజెక్టు ఆయకట్టు పరిరక్షణ సమితి అధ్యక్షులు బొజ్జా దశరథరామిరెడ్డి విమర్శించారు. అసంపూర్తిగా ఉన్న తెలుగుగంగ ప్రాజెక్టు పనులతో పాటు రుద్రవరం, చాగలమర్రి మండలాల్లోని చెరువుల సమస్యలు పరిష్కరించాలనే డిమాండ్‌తో శుక్రవారం సమితి సభ్యులు, వివిధ గ్రామాల రైతులతో కలిసి ఆయన రుద్రవరం రెవెన్యూ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా దశరథరామిరెడ్డి మాట్లాడుతూ నాలుగు శతాబ్దాలు గడుస్తున్నా తెలుగుగంగ ప్రాజెక్టు అసంపూర్తిగానే ఉందన్నారు. కీలకమైన నిర్మాణాలు చేపట్టడంలోనూ విధానాలు అమలు చేయడంలోనూ పాలకులు విఫలమయ్యారన్నారు. వెలుగోడు బ్యాలెన్సింగ్ రిజర్వాయరు వద్ద నేటికీ బైపాస్ కెనాల్ నిర్మాణం చేపట్టక పోవడంతో పూర్తి సామర్థ్యంతో పని చేయడం లేదని, ప్రధాన కాల్వ పనులు పూర్తి చేపట్టకపోవడంతో బ్రహ్మసాగర్‌కు నీరు చేరడం లేదని అన్నారు. కూటమి ప్రభుత్వం తక్షణమే ప్రాజెక్టు పనులను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఏపీ అంటే అమరావతి, పోలవరమే కాదని, డబ్బంతా అక్కడ ఖర్చు చేసి రాయలసీమను నిర్వీర్యం చేయడం సరికాదన్నారు. 90 లక్షల ఎకరాలకు సరిపడా నీటిని శ్రీశైలం నుంచి సముద్రంలోకి పారబోసి, చివరగా పంటలు ఎండుతుంటే సాగు నీరు అందించలేక నోరెళ్లబెడుతున్నారన్నారు. ఇప్పటికైనా అలగనూరు, గోరుకల్లు, వెలుగోడు రిజర్వాయర్లకు మరమ్మతులు చేసి సాగు నీరు అందేలా చూడాలని కోరారు. సమస్యల పరిష్కారం కోసం కూటమి ప్రభుత్వం ఒత్తిడి తెచ్చేందుకు ఈనెల 31న సిద్ధేశ్వరం అలుగు వద్ద భారీ జన సమీకరణతో తొమ్మిదో వార్షికోత్సవం నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దారు మల్లికార్జునరావుకు అందజేశారు.కార్యక్రమంలో సమితి సభ్యులు వైఎన్ రెడ్డి, రామగురివి రెడ్డి, పార్థసారథి రెడ్డి, హరిక్రిష్ణ, రామకృష్ణారెడ్డి, మహబూబ్‌బాషా, దేవానందరెడ్డి, పట్నం రాముడు, రవికుమార్‌రెడ్డి, కొమ్మా శ్రీహరి, తిమ్మారెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డి, వీరబ్రహ్మానందరెడ్డి, మహేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యువకుడి దుర్మరణం



తిప్పన్న (ఫైల్)

కోడుమూరు రూరల్: గూడూరు కొత్తబస్టాండ్ వద్ద జరిగిన రోడ్డుప్రమాదంలో ఓ యువకుడు దుర్మరణం చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. సి.బెళగల్ మండలం పోలకల్‌కు చెందిన తిప్పన్న (26) వ్యక్తిగత పని మీద బైక్‌పై గూడూరుకు వచ్చాడు. పని ముగించుకుని స్వగ్రామానికి బయలుదేరాడు. కాస్త ముందుకెళ్లగానే కొత్త బస్టాండ్ సమీపంలో ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ ఢీకొంది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన తిప్పన్నను స్థానికులు గూడూరు ప్రభుత్వాసుపత్రిలో ప్రథమిక చికిత్స మెరుగైన చికిత్స కోసం కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. గూడూరు ఎస్ఐ తిమ్మయ్య ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. మృతుడికి భార్య రాజేశ్వరి ఉంది.

ఆటో ఢీకొని..



మృతి చెందిన ఉపేంద్ర గౌడ్

వెలుగోడు: రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన ఘటన వెలుగోడు మండలంలో శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. పాములపాడు మండలం పెంచికలపల్లె గ్రామానికి చెందిన వెంకటరమణ కుమారుడు ఉపేంద్ర గౌడ్(28) అత్తగారి ఊరు తూడిచెర్ల గ్రామానికి బైక్‌పై వెళ్తుండగా రేగడ గూడూరు గ్రామం దాటగానే ఆటో ఢీకొంది. ప్రమాదంలో ఉపేంద్రగౌడ్ అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ శేషావలి తెలిపారు.

కారు ఢీకొని మహిళ మృతి

బండి ఆత్మకూరు: మండల పరిధిలోని సంతజూటూరు గ్రామంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గ్రామానికి చెందిన రమణమ్మ(50) దుర్మరణం చెందింది. ఎస్ఐ జగన్‌మోహన్ తెలిపిన వివరాలు.. రమణమ్మ రోడ్డుపై కాలినడకన వెళ్తుండగా పరమటూరు గ్రామానికి చెందిన ఎల్లా సుబ్బయ్య కారుతో వేగంగా ఢీకొట్టాడు. ప్రమాదంలో రమణమ్మ తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలికి భర్త సుబ్బారెడ్డి, కుమారుడు ఆంజనేయ రెడ్డి గతంలోనే అనారోగ్యంతో మృతి చెందారు. మృతురాలి బంధువు చరణ్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అప్పల బాధతో రైతు ఆత్మహత్య



రమేష్(ఫైల్)

కృష్ణగిరి: పంటలసాగు, కుటుంబ పోషణకు చేసిన అప్పులు తీర్చే గత్యంతరం లేక పురుగు మందు తాగి ఓ రైతు అత్మహత్యకు పాల్పడిన ఘటన మండల పరిధిలోని ఎస్‌హెచ్ ఎర్రగుడిలో చోటుచేసుకుంది. ఎస్ఐ మల్లికార్జున తెలిపిన వివరాలు.. ఎస్‌హెచ్ ఎర్రగుడి గ్రామానికి చెందిన బంగారు గొల్ల రమేష్(32), లక్ష్మీదేవి దంపతులకు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు సంతానం. ఇతను తన తల్లి పేరుతో ఉన్న రెండు ఎకరాల తోపాటు మరో నాలుగు ఎకరాలు కౌలుకు తీసుకుని వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. రెండేళ్లుగా పంటలు సరిగా రాకపోవడంతో పెట్టుబడుల కోసం చేసిన రూ.5 లక్షల అప్పు ఎలా తీర్చాలో అని దిగులు చెందేవాడు. ఈక్రమంలో అప్పులు తీర్చేమార్గం లేక గత నెల 28న కృష్ణగిరిలో పురుగు మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెల్దుర్తి సీహెచ్‌సీకి తరలించగా ప్రాథమిక చికిత్స అనంతరం కర్నూలు తరలించారు. అక్కడ కోలుకోలేక శుక్రవారం మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఆయన తెలిపారు.

అదుపుతప్పిన కారు

- ఇంటి కాంపౌండ్‌లోకి దూసుకెళ్లిన వైనం



కాంపౌండ్ వాల్‌ను ఢీకొన్న కారు

ఆలూరు రూరల్: ఓ కారు అదుపుతప్పింది. ఏ కంగా ఇంటి కాంపౌండ్‌లోకి దూసుకెళ్లింది. మండలంలోని హైవే 167లో అగ్రహారం గ్రామంలో శుక్రవారం సాయంత్రం ఈ ఘటన చోటుచేసుకుంది. ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మాన్వి నుంచి ఆలూరు మీదుగా కారులో బళ్లారికి వెళ్తున్నారు. అగ్రహారం గ్రామంలోకి రాగానే కారు అదుపుతప్పి రహదారి పక్కన ఉన్న రామన్న ఇంటి కాంపౌండ్‌లోకి దూసుకెళ్లింది. కాగా ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

విద్యుదాఘాతానికి కూలీ మృతి

కర్నూలు: స్థానిక పాతబస్తీలోని గడ్డా వీధికి చెందిన ఫరూక్ బాషా (60) విద్యుత్ షాక్‌కు గురై ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక అర్ధరాత్రి మృతిచెందాడు. కర్నూలు భూపాల్ కాంప్లెక్స్‌కు ఎదురుగా ఉన్న మేడం వారి సత్రం వీధిలో గురువారం ఓ వస్త్ర దుకాణం పైకప్పు మరమ్మతులు చేస్తుండగా ఫరూక్‌బాషా విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. పైనుంచి కింద పడి తీవ్ర గాయాలపాలవడంతో అక్కడున్న వారు వెంటనే ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించగా కోలుకోలేక అర్ధరాత్రి మృతిచెందాడు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె సంతానం. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు రెండో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.